## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

**డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,**
**మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001**
**ఫోన్: (040) 2475132,**


# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## గుజరాత్‌లో ఘోర రోడ్డుప్రమాదం

గాంధీనగర్: గుజరాత్‌లోని సబర్కాంత జిల్లాలోని హిమ్మత్‌నగర్ సమీపంలో ఉన్న జస్వంత్‌గఢ్ పాటియా వద్ద శ్యామ్లాజీ-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించారు. ఒక ప్రైవేట్ బస్సు అతివేగంగా వెనుక నుండి కారును ఢీకొనడంతో అది పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. పోలీసుల కథనం ప్రకారం, ఈ ప్రమాదం చాలా తీవ్రంగా జరగడంతో కారు తీవ్రంగా దెబ్బతింది. కారులో ఉన్న ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఆరుగురు కూడా తీవ్రంగా గాయపడటంతో వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బస్సు వేగంగా వెళ్తుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ముందున్న కారును ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదం హైవేపై భయాందోళనలు సృష్టించడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, బాధితులకు సహాయం చేయడానికి ప్రయత్నించారు. ఆ వెంటనే పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. నుజ్జునుజ్జైన కారులోంచి మృతదేహాలను వెలికితీయడానికి సమయం పట్టింది. పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపి, కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటన రహదారి భద్రత, జాతీయ రహదారులపై నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.


నల్లగొండ సంపుటి:16 సంచిక:101 ఎడిటర్: సయ్యద్ పాష 30-04-2026 గురువారము పేజీలు :8 వెల:1/-


## గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ



వారణాసి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీబుధవారం హర్దోయ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మీరట్‌ను ప్రయాగ్‌రాజ్‌తో అనుసంధానించే ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ అయిన 594 కిలోమీటర్ల పొడవైన గంగా ఎక్స్‌ప్రెస్‌వేనుప్రారం భించారు. వారణాసిలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... గంగామాతా ఆశీర్వాదం వల్లే.. ఈ ప్రాజక్టు సాకారమైందని తెలిపారు. ఎక్స్ ప్రెస్ వేకు గంగా మాతా పేరుపెట్టుకోవడం సంతోషకరమన్నారు. గంగా మాతా వేల సంవత్సరాలుగా ఈ దేశానికి జీవన రేఖగా ఉందన్నారు. ఈ గంగా ఎక్స్ ప్రెస్ వే యూపీ అభివృద్ధికి కొత్త జీవనరేఖగా నిలుస్తుందని సూచించారు. గంగా ఎక్స్ ప్రెస్ వే నిర్మాణంతో యూపీ ముఖచిత్రం మారిపోయిందన్న మోదీ ఐదేళ్లలోనే భారీ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే భారీ ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యిందన్నారు. భారీ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం ఐదేళ్లలోనే పూర్తి చేశామని వివరించారు. ఇది కేవలం ఎక్స్ ప్రెస్ వే కాదు.. యూపీ అభివృద్ధి, కలల సాకారానికి రాజమార్గం అన్నారు. కొందరు యూపీని బీమారు రాష్ట్రం అని సంబోధించారని ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రధాని ఇవాళ యూపీ మాన్యుఫాక్చరింగ్ హబ్ గా మారిందని సూచించారు. యూపీ మూడు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందన్నారు. దేశానికి రెండు డిఫెన్స్ కారిడార్లు మంజూరు చేస్తే.. ఒకటి యూపీ పొందిం దని పేర్కొన్నారు. పశ్చిమబెం గాల్ లో భారీ ఆధిక్యంతో బీజేపీ గెలుస్తోందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ లో ఈ సారి నిర్భీతి వాతావరణంలో పోలింగ్ జరుగుతోందన్నారు. బెంగాల్ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఉత్సాహంగా తరలివెళ్తున్నారని సూచించారు. బీహార్ లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నిన్న గుజరాత్ మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ బీజేపీ ఘన విజయం సాధించిందని తెలిపారు. మే 4న ఫలితాలు వెలువడే 5రాష్ట్రాల ఎన్నికల్లోనూ బీజేపీ జయకేతనం ఎగురవేస్తోందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

## టెన్త్ ఫలితాల్లోనూ మళ్లీ సత్తా చాటిన బాలికలు..




హైద్రాబాద్:ఏ పరీక్షలైనా బాలికలదే పై చేయి కొనసాగుతోంది. మొన్న విడుదలైన ఇంటర్మీడియట్ రిజల్ట్స్ అయినా.. తాజాగా రిలీజ్ అయిన టెన్త్ ఫలితాల్లో అయినా బాలికలే సత్తా చాటారు. ఇక మొత్తం మీద 95 శాతానికి పైగా విద్యార్థులు పాస్ అయ్యారు. తెలంగాణ టెన్త్ పరీక్షల ఫలితాలను ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు.. తెలంగాణ విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌లు బుధవారం మధ్య?ృహ్నాం విడుదల చేశారు. ఇక రాష్ట్రంలోని తెలుగు మీడియం స్కూళ్లలో ఉత్తీర్ణత శాతం 89.14 శాతంగా ఉండగా.. ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో 95 శాతం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 86.18 శాతం మంది విద్యార్థులు పాస్ అయినట్లు వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు తెలంగాణలో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 5,28,239 మంది విద్యార్థులు హాజరు కాగా.. వారిలో 4,97,312 మంది విద్యార్థులు పాస్ అయినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థుల పాస్ పర్సెంటేజీ 95.15 శాతంగా ఉందని తెలిపారు. ఇందులో 96.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. 94.07 శాతం మంది బాలురు పాసైనట్లు తెలిపారు. ఇక రాష్ట్రంలో ఉన్న 5731 పాఠశాలల్లో వందకు వంద శాతం విద్యార్థులు పాస్ అయినట్లు వివరించారు. ఇక 6 స్కూళ్లలో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదని.. అవన్నీ ప్రైవేటు స్కూల్స్ అని వెల్లడించారు. ఇక జిల్లాల పరంగా చూసుకుంటే.. 99.30 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ములుగు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఇక 89.23 శాతం ఉత్తీర్ణత శాతంతో హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది. పదో తరగతి విద్యార్థులు తమ ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ http://bse.telangana.gov.in/ లో లాగిన్ అయి తెలుసుకోవచ్చని విద్యాశాఖ వెల్లడించింది. 8096958096 వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేసినా రిజల్ట్స్ నేరుగా వస్తాయని తెలిపింది. విద్యాశాఖ తొలిసారిగా పదవ తరగతి ఫలితాలను వాట్సాప్ ద్వారా అందిస్తోంది. ఇక గతేడాది 2025 విద్యా సంవత్సరంలో ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 92.78 శాతం కాగా.. గతం కంటే ఇప్పుడు కొంత పెరిగింది. అబ్బాయిలు, అమ్మాయిల ఉత్తీర్ణత శాతం కూడా గతేడాది పోలిస్తే పెరిగిందని తెలిపారు. ఈ క్రమంలోనే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఒక్కో సబ్జెక్టు రీ కౌంటింగ్ కోసం రూ.500 ఫీజును నిర్ణయించగా.. రీ వెరిఫికేషన్ ఫీజు ఒక సబ్జెక్టుకు రూ.1000 అని తెలిపారు. ఇక టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నాం 12:30 గంటల వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈనెల 30వ తేదీ నుంచి మే 14వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



కూసుమంచి,: ప్రజల సమస్యలను వారి గడప వద్దనే పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కూసుమంచి మండలం పాలేరు గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రజల ఆశలను గత పాలకులు విస్మరించడంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించేలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అధికారులను ప్రజల వద్దకు పంపించి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరించామని అన్నారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా మరోసారి 99 రోజుల ప్రజా ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ పరిధిలో 10 నుంచి 13 గ్రామ పంచాయతీలను చేర్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. మూడు నెలల్లో న్యాయబద్ధమైన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించామని, ప్రతి దరఖాస్తుపై జవాబుదారీతనంతో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేయడం వల్ల ప్రభుత్వంపై విశ్వాసం పెరగడంతో ప్రజా దర్బార్‌లో వచ్చే దరఖాస్తులలో ఎక్కువ శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసమే ఉంటున్నాయని తెలిపారు. ధరణి వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను భూభారతి ద్వారా పరిష్కరించామని, సాదా బైనామా దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూ సేకరణలో వచ్చిన సమస్యలను కూడా పరిష్కరిస్తూ, పెండింగ్ అంశాలను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూ సర్వే చేపడుతున్నామని, రిజిస్ట్రేషన్ సమయంలో తప్పనిసరిగా సర్వే చేసి మ్యాప్ నమోదు చేసే విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. మనిషికి ఆధార్ కార్డు లాగా ప్రతి భూమికి ప్రత్యేకంగా భూధార్ నెంబర్ ఇచ్చే వ్యవస్థను ప్రవేశపెడుతున్నామని, పైలట్ ప్రాజెక్టుగా కొన్ని మండలాల్లో అమలు చేస్తున్నామని, కూసుమంచి మండలంలో కూడా అమలు జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో పాలేరు నియోజక వర్గం ముందుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి, మొక్కజొన్న పంటలను పెద్ద ఎత్తున రైతులు పండించారని, వాటిని కనీస మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, పంటకు సంబంధించిన చెల్లింపులను రికార్డు సమయంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. మే 4న ఖమ్మంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 80కి పైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ కూసుమంచి మండలంలోని మొదటి క్లస్టర్ పరిధిలో నేడు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికార యంత్రాంగం ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వీకరించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రజల గడప వద్దకే పరిపాలన తీసుకు రావడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ప్రజల నుండి వచ్చిన ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తుల్లో సంపూర్ణ కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం మే 4న జరిగే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది
# కాంగ్రెస్సే: మహేశ్ కుమార్



నిజామాబాద్,: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మహేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.

## కేసీఆర్ వల్లే కవితకు గుర్తింపు..



హైద్రాబాద్: కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కేసీఆర్ వల్లే కవితకు గుర్తింపు వచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యమకారుడు కేసీఆర్ బిడ్డగా కవితకు మంచి గుర్తింపు ఉందని.. కానీ కవిత పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదన్నారు. బుధవారం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ఒక ఉద్యమకారుడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వ్యక్తి. అలాంటి వ్యక్తిని స్వయానా కూతురే మొట్టమొదటి సమావేశంలోనే అలా మాట్లాడి తప్పు చేసింది. దాంతోనే తెలంగాణ ప్రజలందరూ కూడా ఆలోచించుకుంటరు. తండ్రిని గౌరవించుకోలేని మనిషి ప్రజలకు తల్లి ఎట్లా అవుతది. ఈ విషయాన్ని నేను తీవ్ర బాధతో చెప్తున్నా. కవిత చాలా తప్పు మాట్లాడిందన్నారు. నీకు అధికారం కావాలని ఆశ ఉండొచ్చు. దాని కోసం నువ్వు ఫైట్ చేస్తే తప్పు లేదు.. కానీ నువ్వు నీ సొంత తండ్రినే ఆ మాట అనడం.. తెలంగాణలో నువ్వేదో చేస్తా అని అంటే ఎవరు నమ్ముతరు నిన్ను. ఆమె పార్టీ సంగతి పక్కన పెట్టు. సొంతంగా ఆమె పోటీ చేసి నియోజకవర్గంలో కూడా డిపాజిట్ కూడా రాదు కవితకు.. ఎందుకంటే తొలి సమావేశంలోనే తండ్రిని కేసీఆర్ లాంటి వ్యక్తిని తిట్టి ఆమె ఉన్న మర్యాద పోగొట్టుకుందన్నారు. పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టినంత సులువైంది.. అంటూ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదు..



హైదరాబాద్, : కాంగ్రెస్ పార్టీ తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పలేదని.. తాను అడగలేదని ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పేవాళ్లు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించింది' అని విమర్శించారు. అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా పర్మిషన్ ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదని, అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. 'మేం సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కుటుంబ లోపాలను కవిత బయటపెడుతున్నారని అన్నారు. పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకుండానే చెబుతున్నట్లు ఉందని అన్నారు. ఓట్లు, సీట్లు కావాలంటే పార్టీని వేరేలా నడపాలని.. తాము మార్పు కోసమే పార్టీని నడుపుతున్నామని స్పష్టం చేశారు. అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా ఉండలేమని, ఈసారి కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ముందు నుంచే నియోజకవర్గాలను ఎంచుకుని పని చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు కోదండరాం తెలిపారు.

## ఇందిరాపురంలో భారీ అగ్నిప్రమాదం

ఘజియాబాద్: ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని ఇందిరాపురం, అభయ్ ఖండ్ ప్రాంతంలో ఉన్న గౌర్ గ్రీన్ అవెన్యూ సొసైటీలోని ఒక నివాస ఫ్లాట్‌లో బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో నివాసితుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఒక ప్రైవేట్ హౌసింగ్ సొసైటీలోని ఒక ఫ్లాట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఆ భవనం నుండి దట్టమైన పొగ వెలువడుతున్న వీడియోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి పలు అగ్నిమాపక వాహనాలను మోహరించారు. అగ్నిమాపక చర్యలు ప్రస్తుతం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. జనసాంద్రత కలిగిన ఇందిరాపురం ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అత్యవసర బృందాలు కృషి చేస్తుండగా స్థానికులలో ఆందోళనలు నెలకొన్నాయి.. ఫ్లాట్లలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదం ఎలా జరిగిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

దేశ టైమ్స్

# సంపాదకీయం

## తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక ఆసక్తికరమైన ధోరణిని గమనించవచ్చు...

రాజకీయాల్లో అధికారాన్ని సాధించడం ఒక ముఖ్య ఘట్టం అయితే, ఆ అధికారాన్ని ప్రజల విశ్వాసంగా నిలబెట్టి తిరిగి ప్రజాతీర్పు పొందడం అసలైన నాయకత్వ పరీక్ష. ప్రస్తుతం ఈ పరీక్షను ఎదుర్కొంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల జోడీ రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలకశక్తిగా మారింది. రేవంత్‌రెడ్డి పలుమార్లు.. 'నేను- మహేష్ కలిసి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం' అనే వ్యాఖ్య ఒక రాజకీయ నినాదం కన్నా ఎక్కువే అని చెప్పక తప్పదు. అది పార్టీ- ప్రభుత్వ సమన్వయానికి ఇచ్చిన సంకేతం. పాలనలో విశ్వాసాన్ని నిర్మించడం, ఆ విశ్వాసాన్ని ఓట్లుగా మలచడం ఈ రెండు భిన్నదశలను సమన్వయం చేయాల్సిన అవసరాన్ని సిఎం రేవంత్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక ఆసక్తికరమైన ధోరణిని గమనించవచ్చు. తెలుగుదేశం పార్టీ 1994 నుంచి 2004 వరకు, ఆ తర్వాత కాంగ్రెస్ 2004 నుంచి 2014 వరకు, రాష్ట్ర విభజన అనంతరం బిఆర్ఎస్ 2014 నుంచి 2023 వరకు అధికారంలో కొనసాగాయి.ఈ వరుసలో ప్రజలు ఒకే పార్టీకి నిరంతరంగా అధికారం ఇవ్వకుండా, కాలానుగుణంగా మార్పును కోరుకున్నారని స్పష్టమవుతుంది. అయితే ఈ మార్పు కేవలం రాజకీయ మార్పు మాత్రమే కాదు.. అది పాలనపై ప్రజల అంచనాలు పెరుగుతున్నాయనే దానికి సంకేతం. కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడం వెనుక పదేళ్ల ప్రతిపక్ష పోరాటం ఉంది. ప్రజా సమస్యలను ఎజెండాగా మార్చిన రాజకీయ దృక్పథం ఉంది. ఇందులో రేవంత్‌రెడ్డి దూకుడు నాయకత్వం కీలకపాత్ర పోషించింది. ఆయన శైలి ప్రత్యర్థులపై ఘాటు విమర్శలు చేయడంలోనే కాకుండా, ప్రజాసమస్యలను నేరుగా రాజకీయ చర్చలోకి తీసుకురావడంలో కూడా ప్రత్యేకంగా నిలిచింది. ఈ దూకుడు కాంగ్రెస్ కేడర్‌లో విశ్వాసాన్ని పునరుద్ధరించింది. అయితే ఎన్నికల గెలుపును నిలబెట్టేది కేవలం దూకుడు కాదు. అది సంస్థాగత బలం, అంతర్గత సమన్వయం, కేడర్ స్థిరత్వంపై ఆధారపడి ఉంటుంది. ఇక్కడే మహేశ్ కుమార్ గౌడ్ పాత్ర కీలకంగా మారింది.టిపిసిసి అధ్యక్షుడిగా ఆయన బాధ్యత కేవలం పార్టీ నిర్వహణ కాదు అది అసంతృప్తులను సమతౌల్యంతో పరిష్కరించడం, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కేడర్‌ను చురుకుగా ఉంచడం, నాయకుల మధ్య సమన్వయాన్ని నిలబెట్టడం.ఘర్షణకంటే సమన్వయానికి దగ్గరగా ఉండే ఆయన శైలి ప్రస్తుతం కాంగ్రెస్‌కు అవసరమైన సంస్థాగత స్థిరత్వాన్ని అందించే అవకాశం కల్పిస్తోంది. ఇద్దరి నాయకత్వ శైలులు పరస్పరం విభిన్నమైనవే అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ బలం ఇదే. రేవంత్ వేగం అయితే, మహేశ్ స్థిరత్వం. ఒకరు ప్రభుత్వానికి ప్రజా ముఖచిత్రం అయితే, మరొకరు పార్టీకి వెన్నెముక. ఈ ఇద్దరి నాయకత్వం సమన్వయంతో పనిచేస్తే అది కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో వ్యూహాత్మక ఆధిక్యాన్ని ఇస్తుంది. ఇక్కడే అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు పరీక్ష మొదలవుతుంది. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు పాలనలో కనిపించకపోతే ప్రజా విశ్వాసం తగ్గిపోతుంది.ప్రజలు నినాదాలను కాదు, ఫలితాలను గుర్తుంచుకుంటారు. అందుకే రేవంత్-మహేశ్ జోడీకి ప్రధాన సవాల్ పాలనలో స్పష్టమైన ఫలితాలు చూపించడం. సంక్షేమం మాత్రమే కాదు, పరిపాలనలో పారదర్శకత కూడా అంతే ముఖ్యం. పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల విస్తరణ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుకు సాగు భరోసా, పట్టణాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతులు ఇవి అన్నీ కలిసి ప్రజాతీర్పును ప్రభావితం చేస్తాయి. ప్రభుత్వం ఎంత పని చేసిందన్నది కంటే, ప్రజలు ఎంత అనుభవించారన్నదే ఎన్నికల్లో ఫలితాన్ని నిర్ణయిస్తుంది. మరోవైపు రాజకీయ ప్రత్యర్థులు కూడా తమ వ్యూహాలను పదును పెడుతున్నారు. బిజెపి తెలంగాణలో తన స్థాయిని విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. బిఆర్ఎస్ తిరిగి పునరుద్ధరణ కోసం కసరత్తు చేస్తోంది. ఈ రెండు శక్తుల మధ్య కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలంటే కేవలం ప్రభుత్వ పనితీరు సరిపోదు పార్టీ అంతర్గత ఐక్యత కూడా అంతే కీలకం.నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయి అసంతృప్తులు, టికెట్ ఆశావహుల పోటీ, పదవుల సమీకరణ ఇవి అధికార పార్టీలకు సహజ సవాళ్లు. వీటిని ముందుగానే సమన్వయం చేయకపోతే ఎన్నికల సమయంలో అవే బలహీనతలుగా మారుతాయి. ఇక్కడే టిపిసిసి అధ్యక్షుడి పాత్ర మరింత పెరుగుతుంది. రేవంత్‌రెడ్డి చెప్పిన నేను- మహేష్ కలిసి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అనే మాట వెనుక అసలు భావం ఇదే. ఇది వ్యక్తిగత స్నేహం గురించి కాదు పార్టీ -ప్రభుత్వ సమన్వయ రాజకీయ తత్వం గురించి. ఒకరు పాలనలో ప్రజా విశ్వాసాన్ని గెలుచుకోవాలి, మరొకరు సంస్థాగతంగా ఆ విశ్వాసాన్ని ఓట్లుగా మలచాలి. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ బలమైన నాయకత్వాన్ని కోరుకుంటారు. అదే సమయంలో అందుబాటులో ఉండే, మాట నిలబెట్టుకునే నాయకత్వాన్ని మరింతగా ఆదరిస్తారు. కాంగ్రెస్ ఈ రెండు లక్షణాలను సమన్వయం చేయగలిగితే తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశాలు బలపడతాయి. రాజకీయాల్లో విజయానికి కేవలం నినాదాలు సరిపోవు వాటిని నిలబెట్టే కార్యాచరణ అవసరం. రేవంత్ రెడ్డి- మహేశ్ కుమార్ గౌడ్ జోడీ ఇప్పుడు ఆ కార్యాచరణకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ జోడీ ప్రజల ఆశలను నెరవేర్చగలిగితే, తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి చరిత్ర సృష్టించడం అసాధ్యం కాదు.

# ధర్మపురి ఆలయాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తాం



ధర్మపురి,: ధర్మపురి ఆలయాన్ని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దుతామని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.గత ప్రభుత్వ కాలంలో ఏనాడు ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, దేవాదాయ శాఖ వైదిక సలహాదారు గోవిందుల హరి తో కలిసి మంత్రి ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు నిర్ణయించారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇందులో భాగంగా గోదావరి తీరం వెంట ఉన్న పలు ఆలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారని మంత్రి వివరించారు.గోదావరి తీరంలో ఉన్న భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం మాస్టర్ ప్లాన్, టెంపుల్ సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారని మంత్రి వివరించారు. బాసరలోని సరస్వతి అమ్మవారు కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి గారు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులకు ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ తోపాటు పలువురు అధికారులు కలిసి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని మంత్రి వివరించారు.ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రజల నుంచి సహకారం కావాలని మంత్రి కోరారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులు చేస్తామని మంత్రి వివరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

అశ్వారావుపేట:మండలంలోని తిరుమలకుంటలో సోమవారం నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేపట్టడం ద్వారా దిగుబడులు పెంచుకోవడంతో పాటు సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా తక్కువ యూరియా వినియోగంతో పంటలను సాగు చేయడం, నీటి యాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవడం, సమతుల్య ఎరువుల వినియోగం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, అవసరమైన క్రిమిసంహారక మందుల సరైన వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు మెరుగైన ఫలితాలు సాధించగలరని, శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని ఎమ్మెల్యే అన్నారు. రైతు ముంగిటకే శాస్త్రవేత్తలను తీసుకువచ్చి ప్రత్యక్ష అవగాహన కల్పించడం ప్రభుత్వ రైతు పక్షపాత దృక్పథానికి నిదర్శనమని తెలిపారు. అనంతరం అశ్వారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ (బీఎఫ్ఏసీ)చైర్మన్ సుంకవల్లి వీరభద్ర రావు,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, స్థానిక సర్పంచ్ కె.రాజేష్, రెడ్డిగూడెం సర్పంచ్ వెంకటరమణ, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు పి. రామ లక్ష్మయ్య, ఎంపీడీవో బి. అప్పారావు, అగ్రికల్చర్ కాలేజ్ డీన్ హేమంత్ కుమార్, అగ్రికల్చర్ ఏడీ రవికుమార్, అగ్రికల్చర్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నికోబార్ లో కేంద్రం పర్యావరణ విధ్వంసం

న్యూఢిల్లీ: గ్రేట్ నికోబార్‌లో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి ముసుగులో వేల ఏళ్ల నాటి అడవులను నరికివేస్తూ.. పర్యావరణ విధ్వంసం చేస్తుందని లోక్ సభ కాంగ్రెస్ పక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అండమాన్ నికోబార్ దీవుల్లో పర్యటించిన రాహుల్‌గాంధీ క్యాంప్‌బెల్ బే ప్రాంతానికి వెళ్లి గిరిజన నేతలతో భేటీ అయ్యారు. గ్రేట్ నికోబార్ ప్రాంతంలో కేంద్రం భారీస్థాయిలో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులపై వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రేట్ నికోబార్ లో పర్యటించిన రాహుల్ గాంధీ అక్కడి పరిస్థితులపై ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. నికోబార్ జరుగుతున్నది మన జీవితకాలంలో ఈ దేశ సహజ, గిరిజన వారసత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న అతిపెద్ద కుంభకోణం, అత్యంత ఘోరమైన నేరాలలో ఒకటిగా పేర్కొన్నారు. ఇది అభివృద్ధి కాదు..ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసం అని ఆరోపించారు.నా జీవితంలో నేను చూసిన అత్యంత అసాధారణమైన అడవులు ఇవి అని, జ్ఞాపకాలకు అందని పురాతనమైన చెట్లు. పెరగడానికి తరతరాలు పట్టిన అడవులకు గ్రేట్ నికోబార్ నెలవు అని గుర్తు చేశారు. ఈ ద్వీపంలోని ప్రజలు కూడా అంతే అందంగా ఉంటారు అని, ఆదివాసీ సమాజాలు, వలసదారులు ఇద్దరూ నివసిస్తున్నారని.. కానీ వారికి చట్టబద్ధంగా దక్కాల్సిన వాటిని దోచుకుంటున్నారని ఆరోపించారు.ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధి పేరుతో చేస్తున్న దానిని గ్రేట్ నికోబార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ "ప్రాజెక్ట్" అని పిలుస్తుందని..కాని నేను చూసింది ప్రాజెక్ట్ కాదు అని.. అది గొడ్డలి వేటుకు గురైన లక్షలాది చెట్లు అని తెలిపారు. ప్రాజెక్టు పేరుతో 160 చదరపు కిలోమీటర్ల వర్షారణ్యం నాశం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి స్థానికుల ఇళ్లను లాక్కుంటూ, ప్రజలను నిర్వాసితులను చేస్తూ...వారి సమస్యలను, సహాయ, పునరావాసాలను పట్టించుకోకుండా పర్యావరణాన్ని, ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.ఇదంతా ఒకే ఒక్క వ్యాపారవేత్త అయిన అదానీ ప్రయోజనం కోసం సాగుతుందని, ఇది అభివృద్ధి కాదు. ఇది మారువేషంలో ఉన్న విధ్వంసం. మన కాలంలోని అతిపెద్ద పర్యావరణ, సామాజిక ద్రోహాలలో ఇది ఒకటిగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. నేను చూసినదాన్ని భారతీయులు కూడా చూడాలని ఎంచుకుంటే ఈ విధ్వంసాన్ని ఆపేందుకు ముందుకొచ్చి పోరాడాలని సూచించారు. నేను చూసినదాన్ని భారతీయులు కూడా చూడాలని ఎంచుకుంటే ఈ విధ్వంసాన్ని ఆపేందుకు ముందుకొచ్చి పోరాడాలని సూచించారు.రాహుల్ గాంధీ తన పర్యటనలో భాగంగా భారతదేశ దక్షిణ చివరి భూభాగం అయిన గ్రేట్ నికోబార్ ద్వీపంలోని లైట్‌హౌస్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. 1984లో ప్రధాని హోదాలో ఇందిరా గాంధీ ఇక్కడ పర్యటించిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, 42 ఏళ్ల తర్వాత అదే చోట నిలబడటం గర్వంగా ఉందన్నారు. భారతదేశ వైవిధ్యం, సముద్ర తీరాల సౌందర్యం అద్భుతమని ఆయన కొనియాడారు. ఇందిరా గాంధీ తర్వాత ఈ ప్రాంతాన్ని సందర్శించిన ప్రధాన నేతగా రాహుల్ నిలిచారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఇందిరా స్మారక విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

# ఐటీలో 7వేల ఉద్యోగాల కోత

బెంగళూరు : భారత ఐటీ పరిశ్రమలో నియామకాలు అమాంతం పడిపోతున్నాయి. గడిచిన సంవత్సరం 2025-26లో దేశంలోని ఐదు ప్రధాన ఐటి కంపెనీలు తమ సిబ్బంది సంఖ్యను దాదాపు 7,000 మేర తగ్గించుకున్నాయి. గతంలో కేవలం ఉద్యోగుల సంఖ్య పెంచుకుంటూ పోయే స్కేల్ డ్రివెన్ వృద్ధి స్థానంలో ఇప్పుడు కంపెనీలు ఏఐ వినియోగం, పని సామర్థ్యాన్ని పెంచే ఎఫిషియెన్సీ ఫస్ట్ నమూనాకు ప్రాధాన్యతనిస్తున్నాయి. కంపెనీల వారీగా పరిశీలిస్తే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అత్యధికంగా 23,460 ఉద్యోగాలను తగ్గించగా, టెక్ మహీంద్రా తన సిబ్బందిలో 1,108 మందిని తగ్గించుకుంది. మరోవైపు ఇన్ఫోసిస్ 5,016, విప్రో 8,810, హెచ్‌సీఎల్ టెక్ 3,761 చొప్పున నియామకాలు కొనసాగించినప్పటికీ.. అవి చాలా నియంత్రిత పద్ధతిలో సాగాయి. ఇంతక్రితం 2024-25లో ఐటీ కంపెనీలు 12,718 ఉద్యోగాలను సృష్టించాయి. 2023-24లో ఐటి రంగం ఏకంగా 69,000 ఉద్యోగాల కోతను చూసింది. దానితో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ వృద్ధిపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం కంపెనీలు ఏఐ-నేటివ్ నిపుణులు, డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ నిపుణుల కోసం వేట సాగిస్తున్నాయి. మరోవైపు, ప్రాజెక్టుల అమలులో జాప్యం కారణంగా ఐటీ స్టాక్స్ ఒత్తిడికి లోనవుతున్నాయి.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి



సైదాపూర్, : గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలనీ, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి అధికారులు ఆదేశించారు. వరిధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వివిధ అంశాలపై కరీంనగర్ జిల్లా సైదాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా, మండల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు జిల్లా మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్ తో పాటు అధికారులకు కీలక సూచనలు చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఇందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే పేమెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలన్నారు. మొదటి విడత లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ఇండ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి మంజూరైన వివిధ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

# గుగ్గిళ్ళ రమేష్ పై తగిన చర్యలు తీసుకోవాలి

ముకరంపుర: సమయంలో చోటుచేసుకున్న సంఘటనలో మున్సిపల్ ఉద్యోగులపై జరిగిన అసాంఘిక చర్యను నిరసిస్తూ, మంగళవారం ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు దారం శ్రీనివాస్ రెడ్డి, మడిపెల్లి కాళీ చరణ్ మాట్లాడుతూ... మాజీ కార్పొరేటర్ గుగ్గిళ్ళ రమేష్ విధుల్లో ఉన్న మున్సిపల్ ఉద్యోగులపై దుర్భాషలాడుతూ తన అసభ్య పదజాలంతో అవమానకరంగా ప్రవర్తించడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో, ఉద్యోగుల జేఏసీ తరపున మాజీ కార్పొరేటర్ గుగ్గిళ్ళ రమేష్ మున్సిపల్ ఉద్యోగులకు బహిరంగంగా, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి గెస్ట్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, ఉద్యోగులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి గొడవల వల్లే కవిత కొత్త పార్టీ

హైదరాబాద్: ఇంటి గొడవ వల్లే కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టిందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని కల్వకుంట కవిత వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆదర్శనగర్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తహసీల్దార్లతో కలిసి అందజేశారు. మరికొందరికి సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీలను అందజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నడుస్తోందని కవిత గుర్తించాలన్నారు.సొంత తండ్రిని రోబోగా అభివర్ణించిన కవిత... తన ఇంటి తగాదాల వల్లే కొత్త పార్టీ పెట్టారని విమర్శించారు. త్వరలోనే ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లతో పాటు మాజీ కార్పొరేటర్లు మామిడి నర్సింగ్‌రావు, వనం సంగీత యాదవ్, నాయకులు రామన్‌గౌడ్, వైల ప్రవీణ్ కుమార్, రమణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆంథోని, రవి, సర్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివిక్రమ్... ఆ ఒక్క సీన్‌లో అసలైన స్టఫ్?



వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ అంటేనే ఒక ప్రత్యేకమైన బ్రాండ్. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన సినిమాలు (రచయితగా మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావు) ఇప్పటికీ టీవీల్లో వస్తే ఛానల్ మార్చకుండా చూసే ప్రేక్షకులు కోకొల్లలు. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ఇద్దరూ 'ఆదర్శ కుటుంబం' సినిమా కోసం చేతులు కలవడంతో అంచనాలు సహజంగానే పెరిగిపోయాయి. సమ్మర్ చివరలో రాబోతున్న ఈ చిత్రం గురించి ప్రస్తుతం ఒక క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీలో వైరల్ అవుతోంది.సినిమా అంటే కేవలం కథే కాదు, ప్రేక్షకుడిని కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలు కూడా ఉండాలి. 'ఆదర్శ కుటుంబం' విషయంలో త్రివిక్రమ్ ఇదే ఫార్ములాను నమ్ముకున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఒక కామెడీ ఎపిసోడ్ ఈ సినిమాకే ప్రాణం అని సమాచారం. సుమారు ఇరవై నిమిషాల పాటు సాగే ఈ సీక్వెన్స్‌లో వెంకటేష్ తన మార్క్ కామెడీ టైమింగ్‌తో విశ్వరూపం చూపించబోతున్నారట.అసలు విషయానికి వస్తే, త్రివిక్రమ్ సినిమాల్లో డైలాగులు ఎంత పదునుగా ఉంటాయో మనకు తెలిసిందే. దానికి వెంకీ ఎనర్జీ తోడైతే ఇక నవ్వుల పండగే. ఈ ప్రత్యేకమైన కామెడీ సీన్ కోసం త్రివిక్రమ్ చాలా రోజులు కష్టపడి పంచ్ డైలాగులు రాశారని తెలుస్తోంది. థియేటర్లోకి వచ్చే ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని, ఇంటిల్లిపాది హాయిగా నవ్వుకునేలా ఈ ఎపిసోడ్‌ను డిజైన్ చేశారు. కేవలం నవ్వులే కాకుండా, ఆ సన్నివేశం కథలో ఒక కీలక మలుపుగా కూడా ఉంటుందని టాక్.త్రివిక్రమ్ తన సినిమాల్లో ఎమోషన్స్ కూడా పక్కాగా ఉండేలా చూసుకుంటారు. 'ఆదర్శ కుటుంబం'లో కూడా కుటుంబ విలువల చుట్టూ కథ తిరుగుతుందని ప్రచారం జరుగుతోంది. నారా రోహిత్ యాంటీ కాప్ రోల్ చేయడం వల్ల కథలో కొంత సీరియస్‌నెస్ ఉన్నప్పటికీ, ఆద్యంతం వినోదానికే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. వెంకీ రోహిత్ మధ్య వచ్చే గిల్లికజ్జాలు కూడా ప్రేక్షకులకు కొత్తగా అనిపిస్తాయని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

# అబ్బవరం లెవెల్ మారుతోంది



ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా సినీ రంగంలో అడుగు పెట్టి.. హీరోగా ఒక స్థాయి అందుకోవడం తేలికైన విషయం కాదు. చాలా కొద్ది మందే ఇలా ఎదుగుతారు. కిరణ్ అబ్బవరం అందులో ఒకడు. 'రాజావారు రాణివారు' అనే చిన్న సినిమాతో హీరోగా పరిచయం అయి.. 'ఎస్ఆర్ కళ్యాణమండపం'తో మంచి గుర్తింపు, కొంతమేర ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించాడు ఈ కడప కుర్రాడు. ఆ తర్వాత అతడికి అవకాశాలు వరుస కట్టగా.. సరైన సినిమాలు ఎంచుకోకపోవడంతో కెరీర్ మధ్యలో గాడి తప్పింది. కానీ 'క' మూవీతో అతను బలంగా బౌన్స్ బ్యాక్ అయ్యాడు. ఆపై 'దిల్ రుబా' నిరాశపరిచినా.. 'కే ర్యాంప్'తో తన ఫ్యాన్ ఫాలోయింగ్, మార్కెట్‌ను బలపరుచుకున్నాడు. ఐతే ఇప్పటిదాకా కిరణ్ చేసిన సినిమాలు ఒకెత్తయితే.. ఇకపై తన నుంచి రాబోయేవి మరో ఎత్తులా కనిపిస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో కిరణ్ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లబోయే సంకేతాలు కనిపిస్తున్నాయి. తన చేతిలో ఉన్న ప్రాజెక్టులు అంత ప్రామిసింగ్‌గా కనిపిస్తున్నాయి.'బేబీ' దర్శక నిర్మాత సాయి రాజేష్ స్క్రిప్టుతో ఆయన నిర్మాణంలోనే తెరకెక్కుతున్న 'చెన్నై లవ్ స్టోరీ'పై మంచి అంచనాలున్నాయి. ఈ సినిమా 'బేబీ' లాగే సెన్సేషన్ క్రియేట్ చేయగలదని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. శ్రీ గౌరీ ప్రియకు తమిళంలో మంచి ఫాలోయింగ్ ఉండడం కలిసొచ్చే అంశం. మరోవైపు కిరణ్.. 'డియర్ కామ్రేడ్' దర్శకుడు భరత్ కమ్మతో 'గువ్వలచెరువు ఘాట్' అనే వెబ్ సిరీస్ చేశాడు. ఇటీవలే రిలీజైన దాని గ్లింప్స్ భలేగా అనిపించింది. దాన్ని పాన్ ఇండియా స్థాయిలో స్ట్రీమ్ చేయబోతోంది అమేజాన్ ప్రైమ్. ఇవి కాక సుకుమార్ అసిస్టెంట్ అయిన వీర కోగటం దర్శకత్వంలో రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఒక యాక్షన్ థ్రిల్లర్‌ను లైన్లో పెట్టాడు కిరణ్. ఇది సుకుమార్ ఆమోదించిన స్క్రిప్టు. ఆయన అన్న కొడుకు అశోక్, మంచి జడ్జిమెంట్ ఉన్న వంశీ నందిపాటి కలిసి నిర్మించబోతున్నారీ సినిమాను. ఈ ఏడాది ద్వితీయార్ధంలో సెట్స్ మీదికి వెళ్లనున్న ఈ సినిమా మీదా కిరణ్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు.ఈ మూడు చిత్రాలతో కిరణ్ రేంజ్ మారిపోతుందన్నది ఆయనతో పాటు సన్నిహిత వర్గాల మాట. ఇవి కాక స్వీయ దర్శకత్వంలో కిరణ్ ఓ సినిమాకు రంగం సిద్ధం చేస్తున్నాడు. చూస్తుంటే వచ్చే రెండు మూడేళ్లలో కిరణ్ మిడ్ రేంజ్ స్టార్లలో ఒకడిగా ఎదిగేలా కనిపిస్తున్నాడు.

# యువతకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత పెంచుతాం

సూర్యాపేట, : భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ పదవుల్లో యువతకు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని తెలంగాణ యూత్ స్టేట్ ఇంచార్జ్ భవ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి యువత కీలక శక్తిగా నిలుస్తుందన్నారు. యువతకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని, ఈ అంశాన్ని ఉన్నత స్థాయి నాయకత్వం ముందు ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు.యువతలో ఉన్న ఉత్సాహం, ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలు పార్టీని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసే ప్రతి యువకుడికి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధిష్టానానికి సూచిస్తామని తెలిపారు.తదుపరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేట్ అభినయ్ మాట్లాడుతూలి యువతకు అవకాశాలు కల్పిస్తే కాంగ్రెస్ పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పొన్నం తరుణ్, జిల్లా ఇన్చార్జిలు సురేష్, రమ్యకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రావ్య, కుక్కడప్పు మహేష్, జావిద్ బేగ్, బొడ్డు సాయి తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మహబూబ్‌నగర్,: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ను నిజమైన అర్హులకు అందినప్పుడే ఆయా పథకాల లక్ష్యం నెరవేరుతుందని, అభివృద్ధి పనులు అన్ని ప్రాంతాల్లో విస్తరిస్తేనే జిల్లా సమగ్ర అభివృద్ధి జరుగుతుందని దిశ కమిటీ చైర్‌పర్సన్, ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలోని ప్రజల పరిష్కారం చేస్తూ,మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అవసరాలు తెలుసుకొని వాటికి తగినట్లుగా అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా నిధుల సద్వినియోగమవుతాయన్నారు. మంగళవారం కలెక్టరే ట్‌లోని సమావేశం మందిరంలో జిల్లా అభివృద్ధి పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం చైర్ పర్సన్, ఎంపీ డీకే అరుణ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలపై క్షేత్ర స్థాయిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఆయిల్ తోటల విస్తరణ, ఆర్గానిక్ ఫామింగ్ ద్వారా కూరగాయల ఉత్పత్తి, వరి, కందులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ పై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.కూరగాయల పందిరి తోటలకు కేంద్ర ప్రభుత్వం లక్ష రూపాయల వరకు సబ్సిడీ అందిస్తుందని దీనిని రైతులు ఉపయోగించుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిగా కేంద్ర నిధులతో చేపడుతుందని అన్నారు.జిల్లాలో ఉన్న మొత్తం 10,163 కేంద్రాల్లో పక్కా భవనాలు లేని 465 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను మొదటి ప్రాధాన్యతలో మంజూరు చేసి, త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని అన్నారు. జిల్లాలో వివిధ రకాల పెన్షన్ అప్లికేషన్ సుమారు 17వేలు పెండింగ్ లో ఉన్నాయని. అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి మంజూరులో జరుగుతున్న జాప్యం ఎందుకని అధికారులను, ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ప్రభుత్వం శాంక్షన్ ఇవ్వలేదని.. వచ్చే విడతలో మంజూరు అయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు.స్వయం సహాయక బృందాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రుణ సౌకర్యాల ద్వారా జరుగుతున్న లబ్ది గురించి ఆరా తీశారు. నిరుపేదలకు నిష్పక్షపాతంగా ఇండ్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పేదలకు పార్టీల ముద్ర వేయడం సరికాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అందిస్తున్న నిధులు అందు తున్న తీరుతెన్నులు అడిగి తెలుసుకున్నారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలకు అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, వాటిపై తీవ్ర చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో దిశ కమిటీ వైస్ చైర్మన్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కలెక్టర్ కుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్లు,జిల్లా అధికార యంత్రాంగం, మహబూబ్‌నగర్ మేయర్ మమత, కార్పొరేటర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, జ్యోతి, బీజేపీ నాయకులు ముచ్చర్లపల్లి జనార్దన్, కరుణాకర్ రెడ్డి , నవీన్ రెడ్డి,తిరుపతి, పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టు మోసాలకు కేంద్రం చెక్



న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు కేంద్రం నడుంబిగించింది. ఇందుకోసం పలు నిబంధనలు ప్రతిపాదించి, తాజాగా దానికి సంబంధించిన ఓ నివేదికను అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. డిజిటల్ అరెస్టు మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్ , అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత మొదలైన చర్యలు చేపట్టనున్నట్లు అందులో పేర్కొంది.డిజిటల్ అరెస్ట్ స్కామ్ ల ముప్పును ఎదుర్కొనేందుకు టెలికాం నియంత్రణ సంస్థలు, సర్వీస్ ప్రొవైడర్లు, ఆర్ బీఐ, టెక్ సంస్థలు, సీబీఐ సహకారంతో పలు చర్యలు చేపట్టినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇందులో భాగంగా డిజిటల్ అరెస్టు మోసాలకు, నేరాలకు పాల్పడుతున్న 9,400 వాట్సాప్ ఖాతాలను నిషేధించినట్లు వెల్లడించింది. వాస్తవానికి దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు కేసులను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఫిబ్రవరి 9న ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (14సీ) ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం డిజిటల్ అరెస్టులతో సహా ఆన్ లైన్ మోసాలపై సుమోటోగా విచారణ చేపట్టింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో నష్టపోయిన వారికి తగు పరిహారం అందించేందుకు ఒక ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాలని, ఇందుకోసం ఆర్ బీఐ, టెలికమ్యునికేషన్ విభాగం ఇతర సంస్థలను సంయుక్తంగా సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే అటార్నీ జనరల్ ఆర్ .వెంకటరమణి ప్రభుత్వం తరఫున తాజా నివేదికను సుప్రీం కోర్టు ముందు దాఖలు చేశారు. ఇందులో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వాట్సాప్ పై తీసుకున్న చర్యలను వివరించారు."ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డీవోటీ ఆదేశాల మేరకు, వాట్సాప్ డిజిటల్ అరెస్టు స్కామ్ లపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ స్కామ్ లపై అత్యంత కఠినమైన పద్ధతులను ఉపయోగించి దర్యాప్తు నిర్వహించింది. ముందుగా 'సీడ్ సిగ్నల్స్ గుర్తించడం ∩ నెట్ వర్క్ లను మ్యాప్ చేయడం ∩ మొత్తం నెట్ వర్క్ పై చర్యలు తీసుకోవడం ∩ ఆటోమేటెడ్ డిఫెన్స్ నిర్మించడం' లాంటి చర్యలు తీసుకుంది. దీని ద్వారా డిజిటల్ అరెస్టులతో ప్రమేయం ఉన్న 9400 ఖాతాలను బ్యాన్ చేసింది'' అని సదరు నివేదికలో పేర్కొన్నారు.నివేదిక ప్రకారం, "వినియోగదారుల రక్షణ కోసం వాట్సాప్ పలు ఫీచర్స్ ను తీసుకొచ్చింది. ముఖ్యంగా ప్రొఫైల్ పిక్చర్ లలో అధికారిక పోలీసు లేదా ప్రభుత్వ చిహ్నాలను ఉపయోగిస్తున్న ఖాతాలను తొలగించే లోగో డిటెక్షన్ వ్యవస్థలు తీసుకొచ్చింది. కొత్తగా క్రియేట్ చేసిన వాట్సాప్ అకౌంట్ల నుంచి కాల్ వస్తే, యూజర్లను హెచ్చరించే ఫీచర్ ను వాట్సాప్ తీసుకురానుంది. అలాగే అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వారి ప్రొఫైల్ ఫొటోలు కనిపించకుండా ఆటోమేటిక్‌గా హైడ్ చేసే ప్రక్రియను త్వరలో ప్రవేశపెట్టనుంది. అలాగే ఫోన్ లో కేవైసీ పూర్తయిన సిమ్ కార్డు ఉంటేనే వాట్సాప్ పనిచేసేలా "సిమ్ బైండింగ్ " విధానాన్ని 4 నుంచి 6 నెలల్లో అమలు చేస్తామని వాట్సాప్ తెలిపింది. ఇక అనుమానాస్పద, మోసపూరిత సిమ్ కార్డులను గుర్తించిన 2 నుంచి 3 గంటల్లోనే వాటిని బ్లాక్ చేసేలా చేయడానికి కట్టుబడి ఉన్నట్లు డీవోటీ పేర్కొంది. సిమ్ కార్డుల జారీలో పారదర్శకత కోసం 'బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ సిస్టమ్ 'ను 2026 డిసెంబర్ నాటికి అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.రూ.10 కోట్లకు పైగా నష్టం వాటిల్లిన డిజిటల్ అరెస్టు కేసులను సీబీఐ నేరుగా విచారణకు స్వీకరించనుంది. ప్రస్తుతం గుజరాత్ , ఢిల్లీకి చెందిన 3 ప్రధాన కేసులను సీబీఐ రీ-రిజిస్టర్ చేసింది. ఇందులో ఢిల్లీకి చెందిన ఓ బాధితుడు ఏకంగా రూ.22.92 కోట్లు కోల్పోవడం గమనార్హం. మనీ మ్యూల్ (డబ్బు మళ్లింపు) కార్యకలాపాలను అరికట్టేందుకు అనుమానాస్పద లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసేలా ఆర్ బీఐ ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ ఓపీ)ని సిద్ధం చేసింది. ఈ నివేదికను రికార్డుల్లోకి తీసుకోవాలని హోంశాఖ సుప్రీంకోర్టును కోరింది. అంతేకాదు ప్రభుత్వం ఈ నివేదికలో, టెలికాం నిబంధనలను కఠినతరం చేయాలని, వాట్సాప్ వంటి సంస్థలు తమ హామీలను సకాలంలో నెరవేర్చాలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది.

# భద్రకాళి ఆలయంలో ఘనంగా వసంతోత్సవం

వరంగల్, : కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు పదవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం పూర్తిచేసి చతుస్థానార్చన జరిపిన తర్వాత అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు.ఉదయం విమానక సేవ (సర్వభూపాల వాహన సేవ), సాయంకాలం చతురస్తసేవపై అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారికి బలి ఉత్సవం జరిపిన పిమ్మట విమానక సేవ వైభవంగా నిర్వహించారు. సాయంకాలం చతురంతసేవ కూడా అత్యంత వైభవంగా నిర్వహించారు.బ్రహ్మోత్సవాలలో ఈ రోజు ఉభయదాతలుగా హైదరాబాదు వాస్తవ్యులు అమంచి నాగపరిమళ శ్రీనివాస రావు దంపతులు, రాష్ట్ర ఉపాధ్యక్షుల ఆవునూరి రాంమూర్తి ఆధ్వర్యంలో అనేకమంది కుమ్మరి కుల పెద్దలు అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు, పూజాద్రవ్యములు శిరస్సు మీద ధరించి మేళతాళాలతో వేదస్వస్తితో గుడిలోనికి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు.అనంతరం అమ్మవారికి షోడశోపచారపూజ జరిపి అమ్మవారి అనుజ్ఞతో స్నపనమండపంలోకి ప్రవేశించి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. తదుపరి నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన జరుపబడిన తర్వాత హోమం జరిపారు. ఆ తర్వాత అమ్మవారికి వాహన సేవ నిర్వహించారు. సాయంకాలం సర్వభూపాల వాహన సేవ కూడా వైభవంగా నిర్వహించారు.

# బీసీ కులగణనపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి

నల్లగొండ,: బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే ప్రధాని పర్యటన అడ్డుకుంటామని, జాతీయ జనగణనలో దేశ ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్రమోడీ పిలుపు ఇవ్వడం బీసీలను నమ్మించి మోసం చేయడమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ నాయకులు సుంకరి మల్లేష్ గౌడ్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జాజుల మాట్లాడారు.గత ఏప్రిల్ 30న ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్‌లో ఈసారి జరిగే జాతి జనగణనలో సమగ్ర కులగనణ చేపడతామని నిర్ణయం తీసుకున్నారన్నారు. అయితే తీరా నిన్నటి నుంచి జరుగుతున్న జాతి జనగణనలో బీసీ కుటుంబాలను లెక్కించకుండా కేంద్రం బీసీలను దగా చేస్తుందని ఆరోపించారు. 33 ప్రశ్నలతో రూపొందించి 34వ ప్రశ్నగా బీసీ కుటుంబాలను ఎందుకు చేర్చలేదన్నారు.బీసీ కులాలను లెక్కించకుండా జాతి జనగణన ఎన్నిసార్లు చేపట్టిన బీసీలకు ఒరిగేది ఏమీ లేదని బీసీలకు ప్రయోజనం లేని జాతి జనగణన ఎవరికోసమని జాజుల ప్రశ్నించారు. బీసీ కులగణనపై బీజేపీ సమాధానం ఇవ్వకుంటే మే 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టబోయే తెలంగాణ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. మహిళా బిల్లు అడ్డుకునేవారు మహిళా ద్రోహులు అంటున్న బీజేపీ బీసీ మహిళలకు సబ్ కోట కల్పిస్తామని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు.మహిళ ఆగ్రహ సభలు నిర్వహిస్తున్న బీజేపీ ఏ మహిళల ప్రయోజనాల కోసం ఈ బిల్లు తీసుకువస్తుందో సమాజానికి తెలుసని, దేశంలోని 40 కోట్ల మంది బీసీ మహిళల ఆకాంక్షలను గౌరవించకుండా కేవలం 10 శాతం ఉన్న మహిళల కోసం మహిళా బిల్లు తీసుకువస్తే సహించేది లేదన్నారు.మహిళా బిల్లు పేరుతో మరో 80 సంవత్సరాలు అగ్రకులాలే అధికారంలో ఉండాలని మహిళా బిల్లు వలన అగ్రకుల నాయకుల భార్యలు, వారి కుటుంబ సభ్యులు మాత్రమే మహిళా బిల్లు లబ్ధి పొందుతారని నిజమైన బీసీ మహిళలకు మహిళా బిల్లు వల్ల ఏమాత్రం లాభం లేదన్నారు.బీసీ డిమాండ్ల సాధన కోసం గల్లి నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సుంకరి ఫౌండేషన్ చైర్మన్ సుంకర మల్లేష్ గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, సాయిబాబా ముదిరాజ్, గూడూరు భాస్కర్, జెల్లా ఆదినారాయణ, హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతోనే.. అధిక దిగుబడులు

మానకొండూరు,: అధిక దిగుబడి ఇచ్చేందుకు దోహదపడే విత్తనశుద్ధిపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రైతులను కోరారు. ఆధునిక వ్యవసాయంలో నాణ్యమైన విత్తనం అధిక దిగుబడి సాధించడానికి దోహదపడుతుందన్నారు. మానకొండూర్ మండలం రంగపేట గ్రామంలో విత్తనశుద్ధి మిషన్, గోదాంను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ . రైతుల దృష్టి పంట దిగుబడులపై మాత్రమే ఉంటుందని, ధాన్యాన్ని శుద్ధి చేయడం, నాణ్యతా ప్రమాణాలు పాటించడంపై వారి ధ్యాస ఉండదన్నారు. ఇప్పటికైనా రైతులు విత్తన శుద్ధిపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అధిక దిగుబడులిచ్చే వంగడాలను ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు రూపొందారని, వాటిని మాత్రమే సాగు చేసి అధిక లాభాలు గడించాలని ఎమ్మెల్యే కోరారు.మార్కెట్ లో వివిధ కంపెనీల పేరిట లభించే వంగడాలతో పంటలు సాగుచేసి నష్టాలపాలు కావొద్దన్నారు. గత పాలకులు వ్యవసాయాన్ని, రైతంగాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నకిలీ వంగడాలు,ఎరువులు, పురుగు మందులు వాడి రైతులు నిలువునా నష్టాలపాలయ్యారని, నష్టాలు పూడ్చలేని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే వారని, ఈ ఆత్మహత్యల పరంపర కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆగిపోయిందన్నారు.కల్తీ పురుగు మందులు, ఎరువులు, నాసిరకం వంగడాల అమ్మకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లెం వేసిందని డాక్టర్ కవ్వంపల్లి గుర్తు చేశారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతిగా పని చేస్తున్నదని ఆయన చెప్పారు.ఏది రైతు ప్రభుత్వమో, ఏది రైతు వ్యతిరేక ప్రభుత్వమో ప్రజలు, రైతులు గమనించాలని ఆయన కోరారు.రైతులను అణగదొక్కేందుకు నల్ల చట్టాలు తీసుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వం మంచి దా, అడుగడుగున రైతులను వంచించి పీకలలోతు నష్టాల్లోకి నెట్టిన గత బీఆర్ఎస్ పాలకులు మంచోళ్లో తేల్చుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందరిగి రవీంద్రచారి, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రేమిడి తిరుమల్ రెడ్డి, మానకొండూరు సిఐ శ్రీలత, తదితరులున్నారు.

